పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఒకరోజు ముందుగానే శనివారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌లు 2 లక్షల 73 వేల 881 మందికి రూ.115.69 కోట్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ మాసపు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ డిసెంబర్ మొదటి తేదీన పంపిణీ చేయవలసి ఉండగా ఒకటో తేదీ ఆదివారం ప్రభుత్వ సెలవు దినం వచ్చినందున ఒకరోజు ముందుగానే శనివారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. గ్రామ, వార్డ్ సచివాలయాల సిబ్బంది పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందిస్తారన్నారు. 30వ తేదీనే నూరు శాతం పెన్షన్ల పంపిణీకి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ముందస్తు సాగు సాధ్యమేనా..?

- నెలాఖరులోపు నాట్లు పూర్తికి ప్రణాళికలు
- 1,90,865 ఎకరాలకు సాగు నీటి ప్రతిపాదన
- సాగు నీటి వ్యవస్థలు పటిష్టమైతేనే సాధ్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో సాగు సీజన్‌ను ముందుకు తీసుకురావడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లకుండా బయట పడవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నిర్దేశించిన సమయానికి రబీ పూర్తి అయితే మార్చి 15వ తేదీకల్లా పంట చేతికొస్తుంది. ఆ తర్వాత 75 రోజుల్లో అపరాలను మూడో పంటగా సాగు చేసుకోవచ్చు. జూన్ మొదటి వారంలోనే ఖరీఫ్ పనులను మొదలు పెట్టుకోవచ్చు. దీని వల్ల సీజన్ ముందుకు వస్తుంది. అక్టోబరు, నవంబరులలో వచ్చే తుపానులు, వరదల వల్ల పంటనష్టం రాకుండా ఉంటుంది. ఈ నేపథ్యంలో బలమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని వ్యవసాయ శాఖ ప్రతి ఏటా చెబుతూనే ఉంది. ఈ ఏడాదీ అదే వల్లిస్తోంది. ఇదంతా బానే ఉన్నా ముందస్తు సాగు ముందుకు సాగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా అధికార యంత్రాంగం ఆ దిశగా ఏనాడూ చర్యలు తీసుకున్న పాపాన పోలేదనే విమర్శలు ఉన్నాయి. సాగునీటి వ్యవస్థలు పటిష్టమైతేనే సాగు నీరు సకాలంలో అందే అవకాశం ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం సాగునీరు సక్రమంగా అందని పరిస్థితుల్లో వేల మంది రైతులు నష్టపోతున్నారు. సరైన దిగుబడులు లేకపోవడంతో కష్టార్జితాన్ని సైతం కోల్పోతున్నారు.

గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని 1,05,341 ఎకరాలు, పిఠాపురం బ్రాంచి కెనాల్ కింద 32,507 ఎకరాలు, ఏలేరు రిజర్వాయర్ కింద 53,017 ఎకరాలు మొత్తం 1,90,865 ఎకరాల ఆయకట్టుకు రబీ సాగునీరు అందించేందుకు ఇటీవల జిల్లా సాగునీటి సలహా మండలి తీర్మానించింది. డిసెంబరు 1 నుంచి ప్రారంభమయ్యే రబీ సీజనులో ఈ ఆయకట్టుల రైతులు డిసెంబరు 31 నాటికి నాట్లు వేసుకుని, 2025 మార్చి 31 లోగా పంటలను పూర్తి చేసుకోవాలని

రైతులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. మొత్తంగా ఇతర సాగునీటి వనరుల ఆధారంగా జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో వరి సుమారు 20వేల ఎకరాల్లో అపరాల సాగు చేపట్టేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించింది.

సాగునీటి వ్యవస్థలు పటిష్టమయ్యేనా..?

ఇటీవల ఎదురైన వరదల సందర్భంగా సాగునీటి వ్యవస్థలను సమర్థవంతంగా కాపాడి, రబీ పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీటి నిల్వలు చేసినప్పటికీ కాలువల ఆధునికీకరణ సక్రమంగా లేకపోవడంతో సాగునీరు క్షేత్రస్థాయిలోకి పూర్తిస్థాయిలో వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. రబీ పంటలకు నీటి విడుదల లోపు జిల్లాలోని సాగునీటి వ్యవస్థ పటిష్టత కోసం రూ.6 కోట్ల నిధులతో పలు పనులను మంజూరు చేశారు. మంజూరు చేసిన పనులన్నిటినీ పూర్తి చేసి, బిల్లులు ఆమోదం కోసం సమర్పించాలని సాగునీటి సలహా మండలి సమావేశంలో ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారీ వరదల వల్ల జిల్లాలో ఏలేరు ప్రాజెక్టు పరిధిలోని 6 మండలాల్లో 208 చోట్ల ఏలేరు కాలువ వెంబడి గండ్లు పడ్డాయి. దీంతో భారీ నష్టం వాటిల్లింది. ఈ గండ్లు పూడ్చేందుకు రూ.19.53 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లా కలెక్టర్ గండ్లు పూడ్చాలని ఆదేశించి రూ.5.5 కోట్ల తాత్కాలిక నిధులు కేటాయించారు. నేటికీ బిల్లులు విడుదల కాలేదు. 67 పనులను ఇప్పటి వరకు తాత్కాలిక పనుల్లో భాగంగా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. ఈ పనులు పూర్తయితేనే గానీ సాగునీరు పూర్తిస్థాయిలో రైతులకు అందే పరిస్థితి కనిపించడం లేదు గండ్లు పూడ్చే పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తేనే సకాలంలో ముందస్తు సాగు చేపట్టే అవకాశం ఉంటుంది. మరోవైపు అత్యవసర పనులు, మరమ్మతుల దృష్ట్యా పంపా రిజర్వాయర్ కింద ఆయకట్టుకు ఈ రబీలో సాగునీటి విడుదలకు అవకాశం లేదని అధికారులు తేల్చి చెప్పేశారు. ఇలా జిల్లాలో కొన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలిగితేనే సాగు పనులు సక్రమంగా ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

యంత్రాంగంలో కానరాని సన్నద్ధత

గతేడది రబీ సేద్యం బాగా ఆలస్యం అయింది. ఏటా డిసెంబర్ నెలాఖరుకి నాట్లు, మార్చి నెలాఖరులోగా వరి కోతలు పూర్తి కావాల్సి ఉంది. ముందస్తు సాగుతో మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేసి వేగవంతంగా రబీ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ అందుకు అనుగుణంగా అధికారులు రైతులను సన్నద్ధం చేయలేకపోయారు. డిసెంబర్ మూడవ వారం దాటినప్పటికీ గత సంవత్సరం 20 శాతం కూడా సాగు పనులు పూర్తి కాలేదు. ముందస్తు సాగు అవసరం, నీటి సరఫరా నియంత్రణ షెడ్యూల్ అంశాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు అందుకు తగ్గట్టుగా రైతులను సన్నద్ధం చేయలేకపోయారనే విమర్శలు వ్యవసాయ శాఖపై ఏటా వినిపిస్తూనే ఉన్నాయి. రైతులకు అవగాహన కల్పించాలని అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశించినా ఫలితం కనిపించలేదు. ఈ ఏడాదైనా అధికార యంత్రాంగం రైతులను ఏ విధంగా ముందస్తు సాగుపై సిద్ధం చేస్తుందో వేచి చూడాలి.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రేషన్ మాఫియా నెట్‌వర్క్ బ్రేక్ డౌన్ చేస్తాం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రేషన్ మాఫియా వెనుక ఎవరున్నా వదిలిపెట్టం, మొత్తం నెట్ వర్క్‌ను బ్రేక్ డౌన్ చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కాకినాడ పోర్టును పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేషన్ బియ్యం పేదప్రజలకు మాత్రమే అందాలన్నారు. కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో ఆయన అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ పోర్టును స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చేశారన్నారు. ఇక్కడ నుంచి ఇంత భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తీర ప్రాంతంలో అక్రమ రవాణా విషయంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందితే అది దేశ భద్రతకే భంగం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోర్టు నుంచి ఇంత పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నప్పుడు భవిష్యత్తులో పేలుడు పదార్థాలు, మత్తు పదార్థాలు అక్రమ రవాణా దిగుమతి కావని గ్యారంటీ ఏమిటన్నారు. కాకినాడ పోర్టు నుంచి జరుగుతున్న అక్రమ రవాణా కార్యకలాపాలపై కేంద్రం, దర్యాప్తు సంస్థల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాని చెబుతున్నా క్షేత్ర స్థాయి అధికారులకు ఇంకా అర్థం కాలేదన్నారు. ప్రతిసారీ ప్రజాప్రతినిధులు వస్తేనే చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. బియ్యం అక్రమ రవాణాపై రేషన్ బియ్యం మాఫియా వెనుక ఉన్న బోటు ఓనర్లు, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులు, దీని వెనకున్న శక్తులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత ఆయన కాకినాడ యాంకరేజ్ పోర్టులో రేషన్ బియ్యంతో పట్టుబడిన స్టెల్లా ఎల్ నౌక వద్దకు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రితో నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ కల్యాణ్ ప్రత్యేక బోట్‌లో వెళ్లి పరిశీలించారు. రేషన్ బియ్యం తరలించే బార్జీలను తనిఖీలు చేశారు. పశ్చిమ ఆఫ్రికా దేశాలకు అక్రమంగా బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్న బార్జ్‌లో 1064 టన్నుల బియ్యం సంచులను పరిశీలించారు.

కాకినాడ పోర్టు విషయమై సిఎం ప్రకటన చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ పోర్టులో తనిఖీలు చేసినంత మాత్రాన ఆనకొండలా తయారైన మాఫియా రవాణా ఆగిపోదని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం తీవ్రంగా వుండడం వల్లనే కాకినాడ పోర్టు అపఖ్యాతి పాలవుతూ ఇక్కడి ఎగుమతులు గుజరాత్ కాండ్లా పోర్టుకు తరలిపోతున్న పరి స్థితి ఏర్పడిందన్నారు. ఎందుకు కట్టడి చేయడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రధాన మంత్రిని ప్రశ్నించాలన్నారు. ఏడాదిన్నర కాలంగా కాకినాడ పోర్టుపై డ్రగ్స్, అక్రమ బియ్యం ఎగుమతి పేరిట పొలిటికల్ బదనామ్ అవుతున్న పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తనిఖీలు, పత్రికా ప్రకటనలు, మీడియా ప్రచారం మినహా ఎవరు దోషులన్నది నిర్ధారణ లేకుండా శిక్షలు లేకుండా ప్రహసనం చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన బందోబస్తు నిర్వహించక పోవడం వల్ల కాకినాడ పోర్టు అధోగతి పాలవుతున్న దుస్థితిని తొలగించాలన్నారు. పోర్టుపై వున్న ఆరోపణలు ఈనాటివి కావని దశాబ్దాల కాలంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

రత్నగిరి నూతన ఇఒగా వీర్ల సుబ్బారావు

ప్రజాశక్తి-శంఖవరం



అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం నూతన ఇఒగా వీర్ల సుబ్బారావు నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆయన ప్రస్తుతం ఎపి ఎయిర్పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్లను వివిధ ప్రాంతాలకు బదిలీలు చేసిన నేపథ్యంలో సుబ్బారావును రత్నగిరి ఇఒగా నియమించారు. వచ్చే బుధవారం ఆయన బాధ్యతలు చేపడుతున్నట్లు దేవస్థానం అధికార వర్గాలు తెలిపాయి.

ప్రసాదరావుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

నండూరి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-కాకినాడ

నండూరి ప్రసాదరావు ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు పిలుపు ఇచ్చారు. కచేరిపేట సిఐటియు కార్యాలయంలో నండూరి 23వ వర్ధంతి సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ అధ్యక్షతన నండూరి చిత్రపటానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, మేడిశెట్టి వెంకటరమణ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడారు. నండూరి ప్రసాదరావు సంపన్న కుటుంబంలో పుట్టినా కార్మిక వర్గం కోసం అహర్నిశలు పని చేశారన్నారు. ఉమ్మడి ఎపిలో సిఐటియు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని, కార్మికవర్గ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్మించారని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యునిగా, ఆంధ్ర రాష్ట్రంలో శాసనమండలి సభ్యునిగా కార్మికులు, కష్టజీవుల సమస్యలపై ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారన్నారు. ఆయన నడిచిన బాటలో కార్మిక వర్గం నడవాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమళ్ల పద్మ, జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్, జిల్లా కమిటీ సభ్యురాలు ఎన్.ఈశ్వరి, ఆఫీస్ కార్యదర్శి టి.రాణి, హరినాథ్, శివ శంకర్, గంగాధర్, శివ శ్రీను, అప్పన్న, టి.శ్రీను, రాజు పాల్గొన్నారు.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యత, మున్సిపాలిటీ వాటర్ ప్లాంట్ల నిర్వహణపై నిర్లక్ష్యం, ప్రైవేట్ ఆర్‌ఒ ప్లాంట్ల విచ్చలవిడి దోపిడీ అనధికారిక నిర్వహణ తదితర అంశాలపై శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడిగా వేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్లో సాధారణ సమావేశం నిర్వహించారు.కౌన్సిలర్ నేతల హరిబాబు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సరఫరా నాణ్యత లేక ప్రైవేట్ ఆర్‌ఒ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. ఎటువంటి నాణ్యతా ప్రమాణాలూ లేకుండా రూ.10 ఉనంచి రూ.20 వరకు 20 లీటర్ల నీటికి దోపిడీ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఈ విషయమై ప్రజాసంఘాలు, కౌన్సిలర్లు గత ఆరు నెలలుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ప్రైవేటు వాటర్ ప్లాంట్లు ఎన్ని ఉన్నాయో సభలో చెప్పాలని డిమాండ్ చేశారు. గణపతినగరం, బ్రాహ్మణపేట తదితర ప్రాంతాల్లో మున్సిపల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహణ అధ్వానంగా మారిందన్నారు. ప్రభుత్వ ఆర్‌ఒ ప్లాంట్లను నిర్లక్ష్యం చేయడాన్ని ఆసరాగా తీసుకుని పట్టణంలో విచ్చలవిడిగా ప్రైవేట్ వ్యక్తులు ఆర్‌ఒ ప్లాంట్లు పెట్టి నాణ్యతలేని నీరు సరఫరా చేస్తూ ప్రజలను దోపిడి గురి చేస్తున్నారని తెలిపారు. కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ వారం రోజుల్లో పరిశీలించి పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. పట్టణంలో తాగునీరు సరఫరా మెరుగు పడడం లేదని కౌన్సిలర్ కరణం రాజకుమార్, పితాని కృష్ణ అన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు మాట్లాడుతూ పసరు రంగు, నురగ వస్తోందని మున్సిపల్ కమిషనర్ తక్షణమే తనిఖీలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

కౌన్సిలర్ పితాని కృష్ణ మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద ఉందని కనీసం దోమల మందు పాగింగ్ చేయించాలని కోరారు. నెంబర్ టు మార్కెట్లో ఇతర ప్రాంతాల వ్యక్తులకు మున్సిపల్ షాపులు రిజర్వ్ కోటాలో కేటాయించడాన్నికౌన్సిలర్ నేతల హరిబాబు తప్పు పట్టారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోజెస్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి అవసరమైతే రద్దు చేయాలని, అర్హత గల స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, సేపేని సురేష్, మున్సిపల్ ఆర్‌ఒ శ్యామల, సయ్యద్ హుస్సేన్, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ఎంఎల్ఎ చినరాజప్పకు 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అచ్చంపేటలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులకు వేతనాలను సకాలంలో చెల్లించాలని, 104 వైద్య సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం రూ.60 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజా ధనం వృథా కాకుండా చూడాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలి అని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు, మహిళా ఉపాధ్యక్షులు వి.ఇందుమతి, ఉద్యోగులు జి.పాపారావు, ఎస్‌కె.ఖలీషా, వి.మహేశ్వరి, ఎస్‌కె.రేష్మ, సుల్తానా, పి.గోవిందు పాల్గొన్నారు.

ఎంఎల్‌కు వినతి పత్రం ఇస్తున్న 104 నాయకులు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై 1న ధర్నా

ప్రజాశక్తి - జగ్గంపేట

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న చేపట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి జుత్తుక నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గోకవరం రోడ్డు శివారు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటుకరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని, కర్మాగారం పూర్తి సామర్థ్యంతో పనిచేసే విధంగా అన్ని వనరులనూ సమకూర్చాలని, ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్త ఉద్యోగులను నియమించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం యాజమాన్యం వేధింపులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మనీయమని స్టీల్ ప్లాంట్ గేట్ వద్ద కార్మికులకు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారన్నారు. కానీ ప్రధాన నరేంద్ర మోడీ వద్ద ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాతా సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యానందం వల్లూరి, జయ బాబు, చినబాబు, చైతన్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి నాయకులు

మూడు నెలల పింఛను ఇస్తాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి -కరప

గత రెండు నెలల నుంచి పింఛన్లు తీసుకోని వారికి మూడు నెలల పింఛను కలిపి ఇస్తామని ఎంపిడిఒ అనుపమ తెలిపారు. ఈ నెలతో కలిపి మూడు నెలలుగా పెన్షన్ తీసుకోకపోతే వచ్చే నెల పెన్షన్ ఆగిపోతుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉన్న అందరూ ఈ నెల తప్పనిసరిగా పెన్షన్ తీసుకోవాలని సూచించారు.

7న పేరెంట్స్, టీచర్స్ మెగా మీట్

ప్రజాశక్తి - పెద్దాపురం

డిసెంబర్ 7న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ మెగా మీట్‌ను ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఎంపిడిఒ శ్రీలలిత అన్నారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో విద్యాశాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మెగా మీట్ అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ఆమె ప్రసంగించారు. డిప్యూటీ డిఇఒ ఈ ప్రభాకర్ శర్మ, మండల విద్యాశాఖ అధికారి కెఆర్‌కె చౌదరి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇటువంటి మీట్‌లు ఉపయోగపడతాయన్నారు. ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

రోడ్డు పనులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి-శంఖవరం

కత్తిపూడి గ్రామంలో కొత్తగా రెండు సిసి రోడ్లు వేసేందుకు నిధులు మంజూరైనట్టు పంచాయతీ కార్యదర్శి భవానీశంకర్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనుల గురించి ఆయన వివరించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షలతో రెండు సిసి రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినట్టు చెప్పారు. ఒక రోడ్డు కొండ వారి పేట నుండి ఆంజనేయస్వామి గుడి జంక్షన్ వరకు, మరొకటి పాత కొత్తూరులో నిర్మించామన్నారు. సర్పంచ్, వార్డ్ సభ్యులను సమన్వయం చేసుకుంటూ పనులు చేస్తున్నట్టు తెలిపారు.

కార్టూ'నిజం'



సమిష్టి కృషితో బాల్యవివాహాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి- తాళ్లరేవు, పెద్దాపురం

అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల సమిష్టి కృషి ద్వారానే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా బాలల హక్కుల సంరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు అన్నారు. తాళ్లరేవు ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ మాధవి అధ్యక్షతన ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006, చైల్డ్ మ్యారేజెస్ రూల్స్ 2023, కిశోరి వికాసం అనే అంశాలపై మండల, గ్రామస్థాయి అధికారులకు శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఎంపిడిఒ సత్యనారాయణ, గాడిమొగ పిహెచ్‌సి. వైద్యులు ఈశ్వర్, కోరంగి ఎఎస్ఐ సత్యనారాయణ, ఎంఇఒ మోకా ఉమ, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, క్రాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి స్వర్ణలత పలు అంశాలను బోధించారు. సమాజ మార్పు కోసం బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టంపై జిల్లా సంరక్షణ అధికారి సిహెచ్.వెంకట్రావు మాట్లాడారు. ఎక్కడ బాలల హక్కులకు విఘాతం కలిగినా, బాల్యవివాహాలు జరుగుతున్నా 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలు జరిగిన తర్వాత కూడా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్య నళిని, నిభావని, ఆయా పంచాయతీల కార్యదర్శులు, మహిళా పోలీసులు, యానిమేటర్లు, వైద్య సిబ్బంది, అంగన్వాడీలు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగని భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. బాల్యవివాహాల రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దాపురం మున్సిపాలిటీ మెప్మా కార్యాలయంలో సిఎంఎం భ్రమరాంబ అధ్యక్షతన ఆర్‌పిలు, మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన బాల్య వాహాల నిరోధ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు, ఆడపిల్లల ఆరోగ్య సమస్యలు, సామాజికంగా ఉత్పన్నమయ్యే సమస్యలు అర్థమయ్యే రీతిలో ప్రజలకు వివరించాలన్నారు. విస్తృతస్థాయి ప్రచారం ద్వారా బాల్య వివాహాలను అరికట్టగలుగుతామన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ పరిధిలో బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా సీఓలు శ్రీదేవి, నర్గీస్, ఆర్‌పిలు పాల్గొన్నారు.

తాళ్లరేవు సదస్సులో మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్రావు

నేరాలు ఘోరాలు

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి- మామిడికుదురు

మామిడికుదురులో ఒక మహిళ మెడలో శుక్రవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. వివరాలు ఇవి.. అడబాల శేషకుమారి మెడలో ఆరుకాసుల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి ఇంటికి వచ్చి పట్టపగలే ఆమె మెడలో గొలుసు చోరీ చేశాడు ఆమె కేకలు వేయడంతో కిందికి తోసేసి గోడ దూకి పారిపోయాడు . పెనుగులాట సందర్భంలో చోరీకి పాల్పడిన దొంగకి సంబంధించిన సెల్ ఫోను కిందపడిపోయింది. నగరం ఎస్ఐ చైతన్య కుమార్ సంఘటనా స్థలాన్ని చేరుకుని విచారణ చేపట్టారు. ముగ్గురు చోరీకి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని లంకల పరివాహక ప్రాంతాలలో శుక్రవారం కొత్తపేట ఎక్సైజ్ కార్యాలయం సిబ్బంది నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సారా విక్రయించేందుకు తీసుకెళుతున్న వెలిచేరు గ్రామానికి చెందిన నిచ్చెన కోళ్ళ నాగరాజును అదుపులో తీసుకున్నారు. అతని వద్ద నుండి 10 లీటర సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎక్సైజ్ ఎస్ఐ కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కె.అన్నవరం, ఇబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరులో ముగ్గురు అరెస్ట్

ఆలమూరు : స్థానిక ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో మద్యం, నాటు సారా అమ్మకాలు నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సిఐ ఐ.డి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సర్కిల్ పరిధిలోని మండపేట మండలంలోని ద్వారపూడికి చెందిన మట్ట వెంకటలక్ష్మి, కేశవరంకు చెందిన గుండిమేని త్రివేణి నాటు సారా అమ్మకాలు చేస్తుండగా వారు వద్ద నుంచి 10 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఆలమూరు మండలంలోని చెముడులంకలో అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న నాగిరెడ్డి మల్లయ్య నుంచి 26 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు రెడ్డివారి పేట సమీపంలో జాతీయ రహదారి 216పై బైపాస్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సును పాల వ్యాను ఢీ కొట్టి అదుపుతప్పి ముందు వెళుతున్న బైకును ఢీకొంది. దీంతో బైకుపై వెళ్తున్న అమలాపురానికి చెందిన ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో కాకినాడ ప్రభుతాసుపత్రికి తరలించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మర్లావ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి నుంచి అక్రమంగా నిలవజేసిన 8 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-తాళ్లరేవు

పి.మల్లవరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా గల స్థలంలో మట్టిని అక్రమంగా తవ్వి కొందరు వ్యక్తులు తరలించారని బాధితులు ధూళిపూడి నరసింహారావు, వెంకట సూర్యనారాయణ శుక్రవారం కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ తండ్రి వారసత్వంగా సంక్రమించిన ఐదున్నర సెంట్ల స్థలంలో సుమారు 6 అడుగుల మేర మట్టిని తవ్వేసి కొందరు దౌర్జన్యంగా తరలించారని బాధితులు ఆరోపించారు. ఆ స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించాలని సర్వే పూర్తయ్యే వరకు ఎవరు ఆ భూముల్లోకి ఎవరు వెళ్ళకూడదని కోరింగ్ ఎస్.ఐ.పి.సత్యనారాయణ చెప్పినట్టు బాధితులు విలేకరులకు తెలిపారు.

హైవేలో డివైడర్‌ను ఢీకొన్న ఆటో

డివైడర్‌ను ఢీకొన్న ఆటో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై ఆటో శుక్రవారం డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు జీడి పిక్కల ఫ్యాక్టరీ మహిళా కార్మికులు గాయాల పాలయ్యారు. మూసివేసిన దీపిక ఫ్యాక్టరీని తెరిపించాలని గత 14 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారి స్వగ్రామమైన పెద్దనాపల్లికి ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిలో పెద్దనాపల్లికి చెందిన కప్పల దేవి, కీర్తి రత్నకుమారి, కీర్తి నాగమణి, బుద్ధ రాణి, శరకణం భూలక్ష్మి, శరణం జగవేణి ఉన్నారు. వీరిని నేషనల్ హైవే అంబులెన్స్‌లో ప్రతిపాడు తరలించారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిఎస్ఒ ఎంవి.ప్రసాద్‌పై చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినా పోర్టులో మంత్రి పవన కల్యాణ్ తనిఖీల అనంతరం యంత్రాంగం కదిలింది. డిఎస్ఒ ఎంవి.ప్రసాద్‌ను పౌరసరఫరాలశాఖ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జి డిఎస్ఒగా లక్ష్మీదేవికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

10 నిమిషాల్లో ముగిసిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో రోడ్లు వీధి దీపాలు డ్రైన్లు వంటి అనేక సమస్యలపై ఈసారైనా తమ సమస్యలు చర్చకు వచ్చి పరిష్కారం అవుతాయని ఎదురుచూసిన ప్రజలకు నిరాశ మిగిలింది. గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ గంద్రెటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో డిసెంబర్ నెల జమ, ఖర్చుల వివరాలు చదివి వినిపించారు కౌన్సిలర్ మైనం భవాని రాజా మాట్లాడుతూ రోడ్లు డ్రైన్లు పూర్తి చేయకుండా నిలిపివేశారని, వాటిని పూర్తి చేయమని కోరగా ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యం అవుతోందని ఎఇ ప్రభాకర్ తెలిపారు. మిగిలిన కౌన్సిలర్లు సమస్యలపై గళమెత్తలేదు. దీంతో 20 మంది కౌన్సిలర్లకు గాను వచ్చిన పదిమంది కౌన్సిలర్లతో సమావేశాన్ని ప్రారంభించి 10 నిమిషాల్లో ముగించారు. ఈ

సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి.రవికుమార్, వైస్ చైర్మన్‌లు గంధం నాగేశ్వరావు, తెడ్లపు అలేఖ్యారాణి, కౌన్సిలర్లు గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, బెందుకుర్తి సత్తిబాబు, సింగం నాగేశ్వరావు పాల్గొన్నారు.

జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలేవీ..

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం జూనియర్ కళాశాల ఎదురుగా పెట్రోల్ బంకు వద్ద మెయిన్ రోడ్డు జంక్షన్ వద్ద తరచుగా జరిగే యాక్సిడెంట్ల నివారణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానానికి నిత్యం వేల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. కార్తీక మాసంలో శని, ఆది, సోమవారాల్లో ఈ సంఖ్య 70 నుండి 80 వేల వరకూ ఉంటుంది. ప్రతిరోజూ 5 నుండి 6 వేల వరకు వాహనాలు కొండ పైకి వెళ్తుంటాయి. తుని నుండి కాకినాడ వైపు వెళ్లే వాహనాలు ముందుకు వెళ్లి యు టర్న్ తీసుకుని కొండ పైకి వెళ్లవలసి ఉంటుంది. అలాంటప్పుడు తరచూ అక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాజమండ్రి వైపు నుండి తుని వెళ్లే వాహనాలు ఎదురుగుండా రావడంతో తరచూ అక్కడ యాక్సిడెంట్లు జరిగి యాత్రికులు

తరచూ ప్రమాదాలు జరుగుతున్న మెయిన్ రోడ్ జంక్షన్

గాయపడుతున్నారు. ఈ కారణంగా ఆ ప్రదేశంలో స్పీడ్‌బ్రేకర్స్, స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రించే గార్డ్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుచున్నారు.

తమ స్థలాలు కాపాడాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక అగ్రహారంలో తాము కొనుగోలు చేసుకున్న స్థలాలు మున్సిపాలిటీకి చెందినవి అని తమను అధికారులు వేధిస్తున్నారని తమను ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణకు పలువురు వినతిపత్రం అందజేశారు. ఆ స్థలంలో పలువురు దళితులు శుక్రవారం టెంట్ వేసి నిరసనకు దిగారు. ఆ సమయంలో అటుగా కాకినాడకు పర్యటనకు వెళుతున్న పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకునివెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము మూడేళ్ల క్రితం భూమి కొనుగోలు చేశామని దానికి సంబంధించిన ఆధారాలు, డాక్యుమెంట్స్ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. తాము కొనుగోలు చేసిన స్థలం మున్సిపాలిటీకి చెందినదని, అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఇల్లు కట్టుకునేందుకు ప్లానింగ్ అడుగుతుంటే లంచాలు అడుతున్నారని, దళితులపై పక్షపాత వైఖరితో

మంత్రి పవన్ కల్యాణ్‌కు సమస్యను వివరిస్తున్న దళితులు

వ్యవహరిస్తున్నారన్నాని వాపోయారు. దీనిపై స్పందించిన మంత్రి పవన్ కల్యాణ్ సమస్యపై వివరాలు పూర్తిగా తెలుసుని త్వరతగతిన పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు సూచించారు.

బాలికల భద్రతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

సమాజంలో బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎంపిడిఒ శ్రీలలిత అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన బాలికల భద్రతా నియమాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని గుర్తించడం, వారిపై ఫిర్యాదు చేసే విధంగా అవగాహన పెంచాలన్నారు. ప్రతి బాలికా స్వేచ్ఛపూరిత వాతావరణంలో పెరిగే విధంగా ప్రతి ఒక్కరూ చేయూతనిస్తూ అండదండలు అందించాలన్నారు, ఈ సదస్సులో పడాల చారిటబుల్ ట్రస్ట్ తరపున ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో బాలికల భద్రత పట్ల అవగాహన పెంచే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పెద్దాపురం ఎంఇఒ విఆర్‌కె.చౌదరి, సామర్లకోట ఎంఇఒ పి.పుల్లయ్య, ఎపిఎంలు శ్రీనుబాబు, సిహెచ్.జగదీశ్వరి ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎన్.ఉమాదేవి, టి.వెంకట రమణమ్మ, జి.వరలక్ష్మి, కె.నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

1న సాగర తీరంలో కుంభాభిషేకం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ సాగర తీరంలో కుంభేశ్వర స్వామి 49వ మహా కుంభాభిషేకం డిసెంబర్ 1న ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు భోగిరెడ్డి తాతయ్య నాయుడు, తోట పుండరీకాక్షులు (బాబి), చిట్నీడి శ్రీనివాస్, గంగాపాత్రుని వాసు, నామన సత్య ప్రసన్న తెలిపారు. ఈ మహా ఉత్సవంలో స్నాన ఘట్టం ఏర్పాటు చేయడమే కాకుండా యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆదివారం అమావాస్య సందర్భంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారు, స్వామి వార్లకు అభిషేకాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో శుక్రవారం కట్టమూరు జిల్లా పరిషత్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైన్స్ ప్రయోగాల అవగాహనలో విద్యార్థులకు ఆమ్లాలు, క్షారాలు, లవణాలు వంటి పాఠ్యాంశాల్లోని అంశాలపై విద్యార్థులతో అర్థమయ్యే రీతిలో ప్రయోగాలు చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

డ్రగ్స్ కట్టడికి చర్యలపై హర్షం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం హర్షణీయమని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొంతకాలంగా గంజాయి సాగు, అక్రమ రవాణా విచ్చలవిడిగా పెరిగిందన్నారు. అనేక మంది విద్యార్థులు వీటికి బానిసలై దోపిడీలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వీటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం డిజి స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం కూడా మంచి పరిణామం అన్నారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-గండేపల్లి

డిసెంబరు 1వ తేదీన ఆదివారం సెలవు కావడంతో సామాజిక భద్రతా పింఛన్లను శనివారం పంపిణీ చేస్తామని ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పింఛన్ పంపిణీ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. గతంలో సెలవు వచ్చిందంటే రెండు రోజులు వాయిదా పడేదని, ప్రస్తుతం సెలవుకు ముందుగానే పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

సాయి తేజ పుట్టిన రోజు వేడుకలు

ఘనంగా సాయి తేజ పుట్టినరోజు

ప్రజాశక్తి-గండేపల్లి

టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయి తేజ పుట్టిన రోజు వేడుకలను మండలంలో సింగారంపాలెం, గండేపల్లిలో శుక్రవారం అభిమానులు కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఉపాధి కూలీలు పనులు నిర్వహించే ప్రదేశంలో కేక్ కట్ చేశారు. గండేపల్లి యూత్ సభ్యులు పసుమర్తి సుబ్రమణ్యం, చిటికెల కన్నబాబు, వెలమాటి కాశి, ఇప్పర్ల బాబి, సుంకువల్లి రమేష్, వెంపటి రాజు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామకృష్ణారెడ్డి

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-పెదపూడి

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం పెద్దాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వారి ధాన్యాన్ని ఎక్కడ కావాలంటే అక్కడ విక్రయించుకునేలా కూటమి ప్రభుత్వం వెసులుబాటు కలిగించిందన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల లోపు రైతులకు సొమ్ము అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జుత్తుక కృష్ణ, జుత్తుక సూరిబాబు, దత్తుడు, గంటా రాజు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ఆసాదులు, అర్చకులు, వేద పండితులు, పండితులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పెండింగ్ అలవెన్స్‌లు చెల్లించాలి

ప్రజాశక్తి-కాకినాడ

సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీల దారి ఖర్చుల అలవెన్స్ వెంటనే చెల్లించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు సమావేశాల పేరిట పదేపదే అంగన్వాడీలను కార్యాలయాలకు తిప్పుతున్నారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న అంగన్వాడీలకు దారి ఖర్చుల అలవెన్స్ చెల్లించాల్సి ఉన్న బకాయిలు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రతి నెలా కాకినాడ జిల్లా పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలను ప్రాజెక్టు సమావేశానికి, సెక్టార్ సమావేశానికి రెండుసార్లు అధికారులు పిలుస్తున్నారని తెలిపారు. వీటికి సబంధించి గతంలో ట్రావెలింగ్ అలవెన్స్ ఇచ్చేవారన్నారు. గత ఒక సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్నా చెల్లించడం లేదన్నారు. 42 రోజుల అంగన్వాడీ సమ్మె సందర్భంగా ఒక సమావేశానికి మాత్రమే ట్రావెలింగ్ అలవెన్స్ ఇస్తాని, గతంలో మాదిరి ఇవ్వలేమని జిఒ కూడా ఇచ్చారన్నారు. జిల్లాలోని 1986 అంగన్వాడీ కేంద్రాల వర్కర్లను నెలకు ఒక సమావేశానికి మాత్రమే పిలుస్తామని చెప్పి పదే పదే ఆఫీస్‌లకు పిలుస్తున్నారని తెలిపారు.

ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆర్చరీ పోటీలకు 30 మంది ఎంపిక

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టంలోని స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం జిల్లా స్థాయి అర్చరీ పోటీలు జరిగాయి. ఈ పోటీలను జనసేన నాయకులు జోగా రమణ మార్నీడి రంగబాబు ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి 85 మంది పాల్గొనగా 30 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు డిసెంబర్ 3 నుండి 5వ తేదీ వరకు విజయవాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని అర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్ఎస్.గోపాలకష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ పోటీలకు ఎంపికైన వారికి బహుమతు ప్రదానం చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా జి.శివప్రసాద్, కె.చిన్నబ్బాయి, బి.కృష్ణార్జున వ్యవహరించారు.

అక్రమ కట్టడాలు ఆపాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తూరంగి పంచాయతీ పరిధిలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో ఉన్న సర్వే నెంబర్ 217/26లో ఉన్న సామాజిక స్థలంలో అక్రమ కట్టడాలను సిపిఎం రూరల్ కమిటీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మట్లాడారు. రెండు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న పార్క్, వాకింగ్ ట్రాక్ పనులు స్థలంలో జరుగు తుండగా మరో వైపు మిగిలిన సామాజిక స్థలంలో అక్రమ కట్టడాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి జోగా రమణమ్మను కోరారు. ఈ బృందంలో చింతపల్లి అజయ్ కుమార్, తొట్టిపూడి రాజా, తటవర్తి సుబ్బారావు, రచ్చా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎరువుల గోదామును పరిశీలిస్తున్న ఎడిఎ రత్నప్రశాంతి

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

రైతులకు ఎంఆర్‌పి ధరలకు మించి ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రత్న ప్రశాంతి హెచ్చరించారు. మండలంలోని ఓం శాంతి ఎరువుల దుకాణంలో, లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజెస్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీ గోదాంలో నిర్వహిస్తున్న ఫర్ టెక్స్ ఎరువులు, పురుగుల మందుల షాపులను తనిఖీ చేసి పరిశీలించారు. ఫారం ఓఎస్ ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు బిల్ బుక్స్ రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య, టెక్నికల్ ఆఫీసర్స్ ఎ.గాయత్రి, విజయలక్ష్మి, పద్మజారాణి పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో హైకోర్ట్ జడ్జి పూజలు

సామర్లకోట : కుమారరామ భీమేశ్వరాలయంలో హైకోర్ట్ జస్టిస్ వి.సుజాత శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ సుజాతకు ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం సిబ్బందితో సాధారంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె భీమేశ్వర స్వామికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆమెకు ఆలయ నంది మండపంలో పండిత ఆశీర్వాద పూజలు జరిపించి ఆశీర్వదించారు. ఈ పూజల్లో హైకోర్ట్ జస్టిస్ వెంట కాకినాడ జిల్లా న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ అర్చకులు సన్నిదిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందర రామయ్య, వేద పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, ఆలయ అధికారి బళ్ల నీలకంఠం పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు

గండేపల్లి : పామాయిల్ తోటలు పెంచడం వల్ల రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని పతంజలి ఫుడ్స్ డిజిఎం ఎఎస్.ప్రకాష్ అన్నారు. శుక్రవారం గండేపల్లి, మండలం బొర్రంపాలెంలో ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్.ప్రకాష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ పంట ప్రాముఖ్యత, ప్రత్యేకతల గురించి వివరించారు. కంపెనీ రైతులకు కల్పించే సదుపాయాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోకల సుబ్బారావు, ఎక్స్ సర్పంచ్ పల్లపు విష్ణు చక్రం, కంపెనీ సిబ్బంది, వీర్రాజు, జివివి.ఎస్.దుర్గా ప్రసాద్, గణేశ్వరరావు, ఎస్‌వి.మణికుమార్, ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

వన సమారాధనలు ఐక్యతకు దోహదం

పెదపూడి : వన సమారాధనలు ఐక్యతకు దోహదపడతాయని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలో పెద్దాడ గ్రామంలో ఉమా సోమేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా శుక్రవారం వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నులుకుర్తి వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు జుత్తుక కష్ణ, యార్లగడ్డ అమ్మన్న చౌదరి, ప్రత్తిపాటి భద్రరావు, గంటా రాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

అభివృద్ధి పనులు భూమి పూజ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

రూ.25 కోట్లతో 58 అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో గత నాలుగు సంవత్సరాల క్రితం నిలిచిపోయిన అభివృద్ధి పనులను దశలవారీగా నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం నియోజకవర్గం పరిధిలోని వెంకట్ నగర్, దొమ్మేటిపేట, సావిత్రి నగర్ గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివద్ధి పనులకు శుక్రవారం ఉదయం ఆయన పరిపాలనాధికారి మునుస్వామి, అధికారులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో రూ.19.50 కోట్ల అభివృద్ధి నిధులు, రూ.2.30 కోట్ల సిఎస్ఆర్ నిధులతో 58 పనులు చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల కోడ్, మరికొన్ని కారణాల వల్ల పనులు నిలిచిపోవడంతో ప్రస్తుతం వడ్డీతో కలిపి సుమారు రూ.25 కోట్లు అయ్యిందన్నారు. ఆ మొత్తంతో ఆయా పనులను దశలవారీగా భూమి పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంట్లో భాగంగా దొమ్మేటిపేట, వెంకట్ నగర్, సావిత్రినగర్‌లో పనులకు భూమి పూజ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావుతో పాటు అధికారులను స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఎఇ కాళ్ల నాగరాజు, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, మల్లాడి కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులు, పాల్గొన్న హస్తకళాకారులు

హస్త కళల ప్రదర్శనపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన హస్త కళలు ,ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. హస్త కళా సేవా కేంద్రం పుదుచ్చేరి, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ వారిచే, మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నళిని, జ్యోతి పాల్గొని మాట్లాడారు. నేటి తరానికి హస్త కళల మీద అవగాహన కలగటానికి ఇటువంటి కార్యమాలు దేశమంతా ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. హస్త కళాకారులు తయారీ విధానాన్ని వివరించి విద్యార్థులకు నేర్పించినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్ అందించారు.

గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న అధికారులు

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - సామర్లకోట

ఆరోగ్య వంతమైన సమాజ స్థాపనకు పోషకాహారం ప్రాధాన్యత ఎంతగానో దోహద పడుతుందని కెటిసి ప్రిన్సిపల్ సౌమ్య సుమలత, డాక్టర్ రమ్య ఆశాలత అన్నారు. ఉండూరు శివారు బ్రహ్మానందపురం ఎస్‌బిసి, కెటిసి రెసిడెన్షియల్ క్యాంపస్‌లో వెయ్యి మంది గర్భిణులకు శుక్రవారం వారు పౌష్టికాహారం పంపిణీ చేశారు. డైరెక్టర్ డాక్టర్ సోడదాసి ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఎస్‌బిసి, కెటిసి స్వచ్ఛంద సంస్థ ద్వారా బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందించామన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

In Court of the Civil Judge Senior Division, Amalapuram

I.A No. 669/2024 / O.S.NO 64/2019

Between:

Dasireddy Veera Raghavulu S/o Mutyalu Aged 81 years, Agriculture Hindu, R/o D.No.2-26-1, Pappulavari Palem P. Gannavaram Mandalam, Dr.B.R.A.Konaseema District pin:533229

...Petitioner/ Plaintiff

AND

Beera Anasuya (late) W/o Pallayya (వగైరాలు)

D-3: Beera Satyanarayana Murthy, S/o Pallayya, Aged about 56 years, D.No.3-53, Dan Center, Papppurlavari palem P. Gannavaram Mandala, Dr.B.R.A.K District 533229

D-4: Beera Srinivasa Rao, S/o Pallayya, Aged about 50 years, -DO-

D-5: Salladi Raja Lakshmi, D/O Pallayya, Aged about 54 years, -DO-

D-6: Petta Bharati, D/O Pallayya, Aged about 52 years, -DO- ***...Defendants***

పై నెంబరు దావాలో మూడవ ప్రతివాది నుండి 6వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తం **ది. 17-12-2024 సం॥ తేదిన వాయిదా వేసినారు మీరు ఆ రోజున ఉదయం గం॥ 10-30 ని॥లకు** స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడుననీ రూఢీగా తెలియపరచడమైనది.

సయ్యద్ హమీద్ పాషా

అమలాపురం — అడ్వకేట్, అమలాపురం

28-11-2024 — సెల్: 9490786161